క్లుప్తంగా

పరిపాలన గణనాథుడికి ఘన వీడ్కోలు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పరిపాలన గణనాథుడికి ఘన వీడ్కోలు పలికారు. 9 రోజులపాటు వివిధ పూజలు అందుకున్న వినాయకుడు గురువారం నిమజ్జనోత్సవానికి తరలి వెళ్లారు. ఈ క్రమంలో ముందుగా గణేష్ మహారాజుకు ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఇతర రెవెన్యూ ఉద్యోగులు ప్రత్యేక అర్చన, మంగళ హారతులు నిర్వహించారు.అనంతరం గణనాథుడు ప్రత్యేక వాహనంపై ఊరేగింపుగా వెళ్లాడు. ఈసందర్భంగా కలెక్టరేట్ ఉద్యోగులు కోలాటాలు ఆడి పాడారు. అనంతరం వినాయకుడు నిమజ్జనానికి తరలి వెళ్లగా ఘాట్‌లో ప్రత్యేక పూజల నిమజ్జనం చేశారు. కాగా, కలెక్టరేట్ వినాయకుడి లడ్డు వేలం పాటలో 3100 రూపాయలకు డీఎస్‌ఓ కార్యాలయంలో పని చేస్తున్న జనార్థన్ దక్కించుకున్నారు. అలాగే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయ గణనాథుడు కూడా ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపుగా నిమజ్జనానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పాత్రికేయుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

వైద్య గణనాథుడికి పూజలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ముందు ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహానికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆసుపత్రిలో చేరిన రోగులు త్వరగా కోలుకునేలా, వారికి మెరుగైన వైద్యసేవలు అందించేలా తగిన శక్తియుక్తులు ప్రసాదించాలని కోరుకున్నారు. ఇన్‌చార్జ్ సీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, సీటీవీఎస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గణేష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఇన్‌చార్జ్ ఏడీఏగా శ్రీవర్ధన్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ కర్నూలు సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ ఏడీఏగా శ్రీవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ ఏడీఏగా పనిచేస్తున్న ఎస్.సాలురెడ్డి దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. దీంతో కర్నూలు ఏడీఏ కార్యాలయంలో టెక్నికల్ ఏఓగా పనిచేస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డికి ఏడీఏగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన అక్టోబరు 17వ తేదీ వరకు ఇన్‌చార్జ్ ఏడీఏగా కొనసాగుతారు.

హోటళ్లకు రూ.12కే కిలో ఉల్లి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని హోటళ్లకు అవసరమైన ఉల్లిని స్థానిక మార్కెట్ యార్డులో కిలో రూ.12కే అందుబాటులో ఉంచినట్లు డీఎస్‌ఓ ఎం.రాజారఘువీర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మరోవైపు రేషన్ షాపుల్లోనూ కిలో రూ.12కే వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని, అవసరం ఉన్న వారు కొనుగోలు చేయాలని సూచించారు.

అమెరికా సుంకాలపై 6న నిరసన

కర్నూలు(సెంట్రల్): అమెరికా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన చేపట్టే నిరసన, ప్రదర్శనలను విజయవంతం చేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు బి.గిడ్డయ్య, డి.గౌస్‌దేశాయ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు, దేశ సార్వభౌమ పరిరక్షణ కోసం జిల్లాలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈకి అభినందన

కర్నూలు(అగ్రికల్చర్): ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈగా బాధ్యతలు స్వీకరించిన మనోహర్‌ను ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా నాయకులు సర్దార్ అబ్దుల్ హమీద్, విజయకుమార్, మగ్బూల్, బాలు తదితరులు కలిసి బొకేలు సమర్పించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసి ఎస్‌ఈగా జిల్లాకు రావడం పట్ల ఎంతో ఆనందంగా ఉందని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం నేత అబ్దుల్ హమీద్ పేర్కొన్నారు.

ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాయలసీమ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. వర్సిటీలో జరిగిన సమావేశంలో ఛలో విజయవాడ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వ తేదీన ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జరిగే ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఓబులేసు, సందీప్, అశోక్, గణేష్, పవన్, తిరుమల్, అనిల్, నవీన్, వినయ్, బాలాజీ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


కుమ్మరిగేరిలో యువకుల విన్యాసం


నృత్యం చేస్తున్న మేయర్ బీవై రామయ్య


ఎన్ఆర్ పేటలో కళాకారుల నృత్యం


వినాయక శోభాయాత్రను తిలకిస్తున్న మహిళలు


విద్యార్థినుల నృత్య ప్రదర్శన


అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్


ప్రత్యేక ఆకర్షణగా భారీ వినాయక విగ్రహం


వినాయక ఊరేగింపులో బాణసంచా వెలుగులు

బైబై గణేశా!

- నగరంలో ప్రశాంతంగా గణనాథుల ఊరేగింపు
- అడుగడుగునా పోలీసు బందోబస్తు


భారీ వినాయకుడిని క్రేన్ సాయంతో కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేస్తున్న భక్తులు

కర్నూలు(టౌన్): నగరంలో గురువారం గణేషుల శోభాయాత్ర, నిమజ్జనం ప్రశాంతంగా జరుగుతోంది. రాంబోట్ల ఆలయం నుంచి ప్రారంభమైన వినాయక శోభాయాత్ర అత్యంత వైభవంగా సాగింది. పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు. భక్తి గీతాలు, సినిమా పాటలు, జానపద పాటలకు యువతీయువకుల నృత్యాలతో శోభాయాత్ర ఉత్సాహంగా సాగింది. ఉదయం 12 గంటలకే పురవీధుల గుండా చిత్తారివీధి, చిన్న మార్కెట్, కుమ్మరి గేరి, బ్రాహ్మణ వీధిగుండా గణనాథులను వన్ టౌన్ సర్కిల్ వరకు తరలించారు. జమ్మిచెట్టు నుంచి వచ్చే గణనాథులను వన్‌టౌన్ పోలీసు స్టేషన్ మీదుగా రంగరాజు వీధి, నెహ్రూ రోడ్డు, చౌక్ బజార్ వరకు మధ్యలో బారికేడ్లు వేసిన పోలీసులు వరుస క్రమంలో పంపించారు. పోలీసులు దగ్గరుండి తరలించడంతో మధ్యాహ్నం 3 గంటలకు మెజార్టీ గణనాథులు కొండారెడ్డి బురుజు వద్దకు చేరుకున్నాయి. పాతబస్తీ నుంచి గణనాథులు చౌక్ బజార్, పెద్ద అమ్మవారి శాల, రాధాక్రిష్ణ టాకీస్, కాంగ్రెస్ పార్టీ ఆఫీసు నుంచి పాత పోలీసు కంట్రోల్ రూం మీదుగా తరలించారు. మరికొన్నింటిని పెద్దమార్కెట్, పాతబస్టాండ్, సాయిబాబా సంజీవయ్య నగర్, కొత్తపేట ఏరియాల నుంచి పాత పోలీసు కంట్రోల్ రూం మీదుగా తరలించారు.

నృత్యం చేసిన మేయర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ

నగరపాలక సంస్థ గణనాథుడి శోభాయాత్రలో మేయర్ బీవై రామయ్య ఉద్యోగులను ఉత్సాహపరుస్తూ నృత్యం చేశారు. అలాగే కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ మనోహరి, ఎస్వీ జనక్ దత్తా రెడ్డి పాతబస్తీ ఏరియాలో శోభాయాత్ర, ఊరేగింపులో పాల్గొన్నారు. స్థానిక భక్తులతో కలిసి నృత్యం చేసి జోష్ నింపారు. అన్నదానం, తాగు నీరు అందించడం వంటి సేవల్లో పాల్గొన్నారు.

నిఘా నీడలో నిమజ్జనం

కర్నూలు: నగరంలో గణేశ్ విగ్రహాల మహా నిమజ్జన ఘట్టం ఆద్యంతం డ్రోన్ వీడియో, సీసీ కెమెరాల నిఘా నీడన సాగింది. పాతబస్తీలోని రాంబొట్ల దేవాలయం నుంచి నిమజ్జనం ఘాట్ వరకు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ కాలినడకన పర్యటిస్తూ బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బందికి తగు సూచనలిస్తూ ముందుకు సాగారు. విగ్రహాలు తరలిన మార్గాల్లో శోభాయాత్ర సాఫీగా సాగేలా ట్రాఫిక్ పోలీసులు వన్ వే ఏర్పాటు చేశారు. నిమజ్జనం పూర్తయిన తర్వాత వాహనాలు దేవనగర్, క్రిష్ణా నగర్, కల్లూరు బ్రిడ్జి మీదుగా బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. శోభాయాత్ర సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు రావడంతో నగరం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంది.

అన్న ప్రసాదాల వితరణ

కర్నూలు(సెంట్రల్)/కర్నూలు(అగ్రికల్చర్): పలు ట్రస్టుల ఆధ్వర్యంలో అన్న ప్రసాదాల వితరణ జరిగింది. మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ నేతృత్వంలో పెద్ద మార్కెట్, ధర్నా చౌక్ వద్ద, శ్రీపరంజ్యోతి భగవతి భగవాన్‌సేవా సమితి ఆధ్వర్యంలో వినాయక ఘాట్ వద్ద అన్నదానం చేశారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నదానం చేపట్టగా, కాంగ్రెస్ పార్టీ వారు భక్తులకు నీళ్ల ప్యాకెట్లను పంపిణీ చేశారు. వీరశైవ అభ్యుదయ సమాజం ఆధ్వర్యంలో తాగునీరు, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 16 చోట్ల తాగునీటి సదుపాయం ఏర్పాటు చేశారు. సీ.క్యాంపు రైతుబజారులో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.


కేసీ కెనాల్‌లో.. గంగమ్మ ఒడికి చేరుతున్న వినాయకుడు


వినాయక నిమజ్జనంలో పాల్గొన్న డీఐజీ కోయ ప్రవీణ్


ట్యాటూ వేయించుకుంటున్న యువకులు

ట్యాటూ, రంగవల్లులపై ఆసక్తి

కర్నూలు(అర్బన్): రోడ్డుకు ఓ వైపున ట్యాటూలు, పచ్చబొట్లు, అరచేతిపై రంగవల్లికలు చిత్రీకరించుకునేందుకు యువతీ, యువకులు ఉత్సాహం చూపారు. డిజైన్‌ను బట్టి రూ.100 నుంచి రూ.300 వరకు వెచ్చించి ట్యాటూ వేయించుకున్నారు. యువతులు అరచేతికి రూ.10 ప్రకారం రంగవల్లులు చిత్రీకరించుకున్నారు.

ఆకట్టుకున్న బొమ్మలు

కర్నూలు(హాస్పిటల్): గృహ అలంకరణ సామగ్రి, పిల్లల ఆటబొమ్మలు, బెలూన్స్ తదితరాలను రాజస్తానీయులు రోడ్డు పక్కన విక్రయించగా పలువురు ఉత్సాహంగా కొనుగోలు చేశారు. వస్తువును బట్టి రూ.50 నుంచి రూ.250 వరకు విక్రయించారు.


పాత్రికేయ గణపతిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు


కుమ్మరి గేరిలో వినాయకుడిని పల్లకీలో నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


వినాయక శోభాయాత్రలో పాల్గొన్న ఎస్వీ మోహన్‌రెడ్డి


గృహ అలంకరణ సామగ్రి విక్రయిస్తున్న రాజస్థాన్ వ్యాపారులు

ఎమ్మెల్యే గుమ్మనూరును బర్తరఫ్ చేయాలి


నిరసన వ్యకం చేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డికి ఫోన్ చేసి బెదిరించిన గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సీఐటీయూ న్యూసిటీ కమిటీ కార్యదర్శి ఆర్.నరసింహులు, నాయకులు టి.రాముడు డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య సర్కిల్‌లో న్యూసిటీ కమిటీ అధ్యక్షుడు వై.నగేష్ ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు గుమ్మనూరుకు వ్యతిరేకంగా ఫ్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ..గుమ్మనూరు జయరాం రౌడీషీటర్ అని, ఇసుక, పేకాట మాఫియా లీడర్ అని, ఆయన చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ అహంకారంతో వీరవీగుతున్నారని ధ్వజమెత్తారు. దొంగ ఓట్లతో గెలిచిన ఆయన మేకపోతు గాంభీర్యంతో వ్యవహరించడం తగదన్నారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లిలో సోలార్ పేరుతో బలవంతపు భూసేకరణ చేస్తున్న కంపెనీకి వ్యతిరేకంగా.. రైతులకు అండగా నిలుస్తున్న ప్రభాకరరెడ్డిని ఆయన ఫోన్ చేసి బెదిరించడం సరైన పద్ధతి కాదని, చేతనైతే రైతులకు మేలు చేయాలని, లేకపోతే ఊరుకోవాలన్నారు. అంతే తప్పా రైతుల కోసం పోరాటం చేస్తున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిపై ఇష్టానుసారంగా మాట్లాడడం తగదన్నారు. కార్యక్రమంలో ఎం.భాస్కర్, సుధాకరప్ప, రాధాకృష్ణ, ఏసు, మహ్మద్‌రఫీ, వెంకటేశ్వర్లు, హుస్సేన్‌వలి, ఓబులేసు పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): రైతుల పక్షాన నిలవాల్సిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కార్పొరేట్లకు కొమ్ము కాస్తుండడంతో పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో.. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎంగరప్ప, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాఘవేంద్ర, ఎస్.అబ్దుల్లా, పీఎన్ఎం జిల్లా నాయకులు ఎస్ఎస్ కన్నా మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రజలకు అండగా నిలవాల్సిన గుంతకల్ ఎమ్మెల్యే కమీషన్లకు కక్కుర్తి పడి రైతుల భూములను సోలార్ కంపెనీకి అప్పగించేందుకు పూనుకోవడం అన్యాయమన్నారు. గుత్తి మండలంలో రైతుల పక్షాన మాట్లాడిన ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డిని ఫోన్‌లో బెదిరించడం దారుణమన్నారు. వెంటనే ఆయన బహిరంగంగా క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. నాయకులు హరికిషన్‌రెడ్డి, రఘువరన్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

సుంకేసుల బ్యారేజీని పరిశీలించిన కేఆర్ఎంబీ చైర్మన్


సుంకేసుల బ్యారేజీని పరిశీలిస్తున్న కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండ్యా

కర్నూలు (సిటీ): కృష్ణా నది యాజమాన్య బోర్డు చైర్మన్ బీపీ పాండ్యా గురువారం సుంకేసుల బ్యారేజీని పరిశీలించారు. ఆయన కేఆర్ఎంబీ చైర్మన్ అయిన తర్వాత మొదటిసారి ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ నెల 2న శ్రీశైలం చేరుకుని బుధవారం ఉదయం శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు పరిస్థితి, ఆ ప్రాజెక్టు గేట్ల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురువారం ఉదయం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించి, దిగువకు వదిలిన నీటి వివరాలను ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుంకేసుల బ్యారేజీని పరిశీలించి బ్యారేజి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేఆర్ఎంబీ సభ్యులు, కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్, బ్యారేజీ ఏఈఈ మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు


క్యాజువాలిటీలో ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): వినాయక నిమజ్జనోత్సవం పురస్కరించుకుని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. అత్యవసర విభాగంలో పనిచేసే ఎమర్జెన్సీ మెడికల్ ఆఫీసర్లు, డ్యూటీ డాక్టర్లు (డీపీపీ, డీఏఎస్, డీఓఎస్), 30 మంది నర్సింగ్ సిబ్బంది, ఇతర సహాయక సిబ్బంది అందుబాటులో ఉండేలా సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశాలు జారీ చేశారు. ఏటా నిమజ్జనోత్సవలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనడం, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో రద్దీ కారణంగా ప్రమాదాలు, గాయాలు, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేసినట్లు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే అత్యవసర ఔషధాలు, శస్త్రచికిత్స పరికరాలు, రక్తనిల్వలు, ప్రథమ చికిత్స సామగ్రిని సిద్ధంగా ఉంచామన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి వచ్చినా 24 గంటలూ వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు ఆయన క్యాజువాలిటీలో ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఎమర్జెన్సీ విభాగం వైద్యులు శారద, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీగా పనిచేస్తున్న చరణ్ శంకర్ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, అతని కుటుంబానికి అండగా ఉంటామని హెల్త్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు రామాంజనేయులు, ఈగల్ ఏజెన్సీ అధికారులు సర్వేశ్వరరావు, రామకృష్ణ తెలిపారు. గురువారం సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో అధికారులు, ఏజెన్సీ వారు చరణ్ శంకర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి మట్టి ఖర్చుల కోసం రూ.10 వేలను అందజేశారు. చరణ్ శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. సీఐటీయూ నాయకులు ఉన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర అవార్డులకు నామినేషన్లు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా అక్టోబర్ 2న జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జిల్లాలో అవార్డులను అందించేందుకు నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కేటగిరీల్లో ఎంపికైన శాఖలకు అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి ఆన్‌లైన్ విధానంలో 13 శాఖలకు అవార్డులు ఇచ్చేందుకు ఎంపిక జరుగుతుందన్నారు. స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు, ఎన్‌జీఓలు, రెసిడెన్షియల్ పాఠశాలల కేటగిరీల్లో నామినేషన్స్ పంపాలన్నారు. నామినేషన్లను సంబంధిత ఎంపీడీఓల ద్వారా జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి ఈ నెల 8వ తేదీలోగా పంపాలన్నారు. ఎంపికైన వారికి జిల్లా స్థాయిలో అవార్డుల ప్రదానం జరుగుతుందని వెల్లడించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని కోరుతూ చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయిఉదయ్, రంగప్ప పిలుపునిచ్చారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నిరంకుశ వైఖరిపై నిరసన తెలుపుతూ ఈ నెల 6వ తేదీన చలో విజయవాడకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. జీఓ నంబర్ 77ను రద్దు చేస్తామని చెప్పిన మంత్రి మోసం చేస్తున్నారని ఆరోపించారు. హాస్టళ్లలో ఉండి చదువుకునే విద్యార్థులకు మెస్ చార్జీలు నెలకు రూ.3 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

యూరియా పక్కదారి పట్టకుండా నిఘా

కర్నూలు(సెంట్రల్): యూరియా పక్కదారి పట్టకుండా పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయాధికారులు నిఘా ఉంచాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డీఓలు, వ్యవసాయాధికారులు, డీఎస్పీలు, తహసీల్దార్లతో సమీక్షించారు. యూరియా పక్కదారి పట్టకుండా ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టుల్లో నిఘా ఉంచాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1329 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, గురువారం మరో 904 టన్నులు, 6వ తేదీ లోపు 2600 టన్నులు మొత్తం 6104 టన్నుల యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. కౌతాళం, హోళగుంద, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు, కోసిగి, ఆలూరు, పత్తికొండ, సీబెళగల్ మండలాల వ్యవసాయాధికారులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ...ఆయా మండలాల్లోనే ప్రత్యేకంగా సమస్యలు వస్తున్నాయని, పంపిణీ సాఫీగా సాగేలా చూడాలని ఆదేశించారు. నానో యూరియాను వాడాలని రైతుల నంబర్లకు వాట్సాప్ చేయాలని, వీలైనన్నీ ఎక్కువ గ్రూపుల్లో షేర్ చేయాలని వ్యవసాయధికారులకు సూచించారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మీ పాల్గొన్నారు.

టీచర్లకు ఉచితంగా మామోగ్రామ్ పరీక్షలు

కర్నూలు(హాస్పిటల్): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలులోని ఒమేగా హాస్పిటల్‌లో మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఉచితంగా మామోగ్రామ్(రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ) పరీక్షలు చేయనున్నట్లు హాస్పిటల్ సీఓఓ డాక్టర్ గణేష్ చెప్పారు. ఈ మేరకు కర్నూలు డీఈఓ శామ్యూల్‌పాల్‌కు వివరాలు అందజేశామన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని కళాశాలలు,పాఠశాలల్లో పనిచేసే మహిళా ఉపాధ్యాయినులు, అధ్యాపకులందరూ కర్నూలులోని ఒమెగా హాస్పిటల్‌లో ఈ నెల 5 నుంచి 15వ తేది వరకు నిర్వహించే ఉచిత వైద్యశిబిరంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.